క్లుప్తంగా

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డోన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, మహేశ్వరనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేలు అమలు చెయ్యాలని, నైటీ డ్యూటీలను రద్దు చెయ్యాలని, అర్హత కల్గిన వారికి వీఆర్‌ఓగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. పై డిమాండ్ల సాధన కోసం ఈనెల 4న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు వీఆర్ఏలు తరలిరావాలని కోరారు. అనంతరం తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


అమ్మవారిని పల్లకీపై ఊరేగిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా సాగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా స్వాతి వేడుకలు


నవగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న చెంచులక్ష్మీ సమేత పవన నరసింహ స్వామి ఆలయంలో స్వాతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బాలిశెట్టి పావన నరసింహ మూర్తి ఆధ్వర్యంలో అర్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. నవగ్రహాలకు అహోబిలం నవనరసింహ క్షేత్రం నుంచి తీసుకొచ్చిన జలంతో అభిషకాలు చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఆకాశదీపం ఏర్పాటు


ఆకాశ దీపం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: హెచ్ కొట్టాల సమీపాన వెలసిన శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఆకాశ దీపం ఏర్పాటు చేశారు. అంతకు ముందు ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్, భక్తులు భజన కృష్ణయ్య, ప్రసాద్‌రెడ్డి, యండూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


బేతంచెర్ల: గాడు బావి ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కసుమ ఆంజనేయస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాస అమావాస్య పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి చేపట్టారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయం, సిమెంట్‌నగర్‌లోని సుంకులా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డోన్ టౌన్ : గుమ్మకొండ సమీపంలోని కొండల్లో వెలసిన పాతమల్ల బంగారుకొండ అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

బడికెళ్లాలంటే భయం!

- శిథిలావస్థలో ముచ్చలపురి ప్రాథమిక పాఠశాల భవనం
- భవనం పైకప్పు పెచ్చులూడుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఆగిన నూతన పాఠశాల భవన నిర్మాణం


నిలిపోయిన నూతన భవన నిర్మాణం


పెచ్చులూడిన తరగతి గది పైకప్పు


శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం

సంజామల: మండలంలోని ముచ్చలపురి గ్రామంలో విద్యార్థులు బడికెళ్లాలంటేనే భయపడుతున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో 28 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకంతా కలిసి ఒకే గది ఉంది. పాఠశాల భవనం నిర్మించి చాలా సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. ఇక వర్షకాలంలో పై నుంచి నీరు కారుతుండటంతో విద్యార్థులు తరగతి గదిలో ఉండలేని పరిస్థితి. ఇటీవల ఉపాధ్యాయుడు పాఠం బోధిస్తుండగా పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అదృష్టవ శాత్తూ విద్యార్థులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఇక పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు..

ఎక్కడి పనులు అక్కడే..

పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వం నూతన పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం నాడు- నేడు కార్యక్రమం కింద రూ.13.5 లక్షలు మంజూరు చేసింది. దీంతో అధికారులు తరగతి గదులతోపాటు మరుగుదొడ్ల నిర్మాణాన్ని కూడా ప్రారంభించారు. భవనానికి శ్లాబ్ కూడా వేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరితగతిన నూతన పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

భయంగా ఉంది



స్కూల్లో పై నుంచి సిమెంటు పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఈ మధ్య సార్ పాఠం చెబుతుండగా పెచ్చులు పడ్డాయి. మాకు ఎవరకీ దెబ్బలు తగలలేదు. బడికి వెళ్లాలంటనే భయం ఉంది. -పూజిత, 5వ తరగతి విద్యార్థిని

వర్షం పడితే కారుతుంది



వర్షం పడినప్పుడల్లా పాఠశాల పై కప్పు నుంచి వర్షపు నీరు కారుతోంది. మేము చదువుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.
-మహేశ్వరి, 4వ తరగతి విద్యార్థిని

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైను లీకేజీ కారణంగా శనివారం మంచినీటి సరఫరాలో అంతరాయం కలగనుంది.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈదుల దేవరబండ- బండగట్టు గ్రామాల మధ్యలో పైపులైన్ లీకేజీ ఏర్పడిందని తెలిపారు. పైప్‌లైన్‌ను మరమ్మతు చేసి ఆదివారం మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

టెంకాయల వేలం

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన టెంకాయల వేలం పాటలో రూ.81 వేల ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా నాలుగు వారాల పాటు టెంకాయల విక్రయం కోసం వేలం వేయగా బందార్లపల్లెకు చెందిన రామాంజనేయులు వేలాన్ని దక్కించుకున్నారన్నారు.

కళాశాలకు సామగ్రి విరాళం

డోన్ టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.1.60 లక్షల విలువ చేసే సామగ్రిని కళాశాల పూర్వ విద్యార్థి కెనరా బ్యాంక్ ఏజీఎం కె.రామకృష్ణకిశోర్ (1986-88 బ్యాచ్) విరాళంగా అందించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. హెచ్‌పీ కంప్యూటర్, ప్రింటర్, ఆటోమేటిక్ ఎలక్ట్రికల్ స్కూల్ బెల్, 10 టేబుళ్లు, 20 ఎస్ టైప్ చైర్స్ అందించారన్నారు. ప్రిన్సిపాల్ దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉక్కు మనిషి అడుగు జాడల్లో నడవాలి


పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కోవెలకుంట్ల: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగు జాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సంస్థ అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ అడుగు జాడల్లో పటేల్ అహింసా సిద్ధాంతంతో స్వరాజ్యస్థాపనకు ఎంతగానో కృషి చేశారన్నారు. ఏడు పదుల వయస్సులో కూడా పోరాటమే ఊపిరిగా దేశ సేవలో ప్రాణాలర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు రామసుబ్బారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మల్లికార్జునరావు, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు


నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలఈశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాలఈశ్వరరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తాడిపత్రి రోడ్డులో ఇటిక్యాల రెవెన్యూ పరిధిలోని 112/ఎ సర్వే నంబర్‌లో బీటీ నాయుడు అనే వ్యక్తి నిర్మాణం చేపడుతుండంతో పనులను నిలిపేయించారు. ఈసందర్భంగా తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం నిర్మాణ పనులను ఆపాలని బీటీ నాయుడుకు నోటీసులు జారీ చేశామన్నారు. యథావిధిగా పనులు కొనసాగిస్తుండటంతో సర్వేయర్ జగదీష్‌తో కలిసి అక్కడికి వెళ్లి రికార్డులు పరిశీలించి పనులు నిలుపుదల చేయించామన్నారు. సంబంధిత యజమాని సరైన పత్రాలు తీసుకొస్తే పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

ట్రాఫిక్ విభాగం ప్రారంభం


ట్రాఫిక్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ విభాగం కార్యాలయాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం రాత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు


కోవెలకుంట్లలో బాణసంచా కాలుస్తున్న మహిళలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గవ్యాప్తంగా దీపావళి సంబరాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు, బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. కోవెలకుంట్ల ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన టపాసు విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

బేతంచెర్ల: మండలంలో దీపావళి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్త, వికాసభారతి అధ్యక్షుడు ఐవి సుజాతశర్మ, మారుతి శర్మ స్వగృహంలో మహాలక్ష్మి ప్రత్యేక పూజల అనంతరం కార్మికులకు మిఠాయిలు పంచి పెట్టి టపాసులు పెల్చి సంబరాలు జరుపుకున్నారు. చెన్న కేశవస్వామి ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, పూదోట మఠంలో వెలసిన శివునికి దీపాలు వెలిగించి మహిళలు, భక్తాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రవేళ మహిళలు తమ స్వగృహాల ముందు దీపాలు వెలిగించగా చిన్నారులు, పెద్దలు టపాసులు పేలుస్తూ పండుగను జరుపుకున్నారు. అమ్మవారిశాలలో వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు.


కోవెలకుంట్ల సమీపంలో ఏపుగా పెరిగిన కంది పైరు

ఆశాజనకంగా కంది

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్ కింద సాగైన కంది పంట ఆశాజనకంగా ఉంది. గతేడాది కందిలో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం, మార్కెట్‌లో క్వింటా రూ.10 వేల వరకు ధర లభించడంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో కంది సాగైంది. సబ్ డివిజన్‌లోని కొలిమిగుండ్ల మండలంలో 704 హెక్టార్లు, అవుకు 475, కోవెలకుంట్ల 397, దొర్నిపాడు 377, ఉయ్యాలవాడ 795, సంజామల మండలంలో 621హెక్టార్లలో కంది పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. విత్తనానికి ముందు, పైరు వివిధ దశల్లో విస్తారంగా వర్షాలు కురిసి ప్రస్తుతం పైరు పూత దశకు చేరుకుంది. కందిపంటకు వాతావరణం అనుకూలంగా మారటంతో రైతులు దిగుబడుల ఆశలు పెట్టుకున్నారు.

అమరజీవి త్యాగం మరువలేనది


బేతంచెర్ల: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లను అందజేస్తున్న ఎంఈఓలు, ఆర్యవైశ్యులు


కోవెలకుంట్లలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



డోన్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు


బనగానపల్లి మండలం టంగుటూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ఎంఈఓలు సోమశేఖర్, పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం బుగ్గానిపల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కంద గడ్డల జనార్దన్, విష్ణు, సుధీర్ ఆధ్వర్యంలో దాతలు ఆలంపల్లె రాజశేఖర్ , అనిల్ కుమార్ సహకారంతో 260 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘం నేతలు లక్ష్మినారాయణ, మధు సురేంద్ర, గణేష్, ప్రశాంత్, బల్లానీ సూర్య పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: అమరజీవి పొట్టిశ్రీరాములు లాంటి ఎందరో మహనీయుల త్యాగనిరతి ఫలితమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవమని వక్తలు కొనియడారు. శుక్రవారం పట్టణంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అమ్మవారి శాల ఆవరణలో ఉన్న అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పెండేకంటి నాగరాజు, శిల్పసుబ్రమణ్యం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్య ఉద్యమంలో జాతిపిత మహాత్మగాంధీ ఆశయాలకు ఆకర్షితుడై జాతిపిత బాటలో నడిచారన్నారు. ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో నలిగిపోతున్న తెలుగువారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, శేషఫణి, ఆనంద్‌బాబు, భూమా కన్నయ్య, లక్ష్మినారాయణ, కాల్వ శివనాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని వక్తలు కొనియాడారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాతపేట జెడ్పీ హైస్కూల్లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆవోపా, ఆర్యవైశ్య సంఘాల నేతలు పట్టణంలో ప్రైవేట్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీగా రైల్వే గేట్ల నడుమ ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని కోరారు.

బనగానపల్లె : టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పర్వీన్‌ఖాను ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను హెచ్ఎం తెలియజేశారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, సుబ్బారెడ్డి, గోపాల్‌రావు, హరినాథ్‌గౌడ్, ఓబయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని తన ప్రాణాలను సైతం అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారిణి సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లెక్చరర్లు నవీన పాటి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్యాపిలి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..అనంతపురం జిల్లా యాడికి పట్టణానికి చెందిన మహమ్మద్ తన భార్య రఫికాతో కలసి గత నెల 29న కర్నూలులో చదువుతున్న తమ కుమార్తెను చూసేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా పోతుదొడ్డి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలిపోయింది. దీంతో కారులో ఉన్న మహమ్మద్, రఫికా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహమ్మద్ (52) అక్కడే మృతి చెందాడు. రఫికా అక్కడే చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమరవీరుల వారోత్సవాలు జయప్రదం చేయండి

డోన్ టౌన్ : ఈ నెల 9 వరకు జిల్లాలోని ప్రతి గ్రామంలో నిర్వహించనున్న విప్లవ అమరవీరుల వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారం రంగనాయకులు కోరారు. తారకరామనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం వారోత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో జన్మించిన చంద్ర పుల్లారెడ్డి, కల్లూరు మండలం బొల్లవరం గ్రామ వాసి నీలం రామచంద్రయ్యతో పాటు అమరులైన ఎందరో వీరుల ఆశయ సాధన కోసం కృషి చేస్తామన్నారు. ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు జాన్సన్, నాయకులు చందు, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 3, 4 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా డీఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 జిల్లాల నుంచి 160మంది క్రీడాకారులు, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, మున్సిపల్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పింఛన్.. సర్వర్ మొరాయించెన్!


సర్వర్లు పని చేయకపోవడంతో బనగానపల్లె సచివాలయం వద్ద పింఛన్ కోసం వచ్చిన లబ్ధిదారులు


డోన్ మూడో సచివాలయం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

బనగానపల్లెరూరల్/ కోవెలకుంట్ల/ కొలిమిగుండ్ల/ డోన్ టౌన్/ బేతంచెర్ల : సర్వర్ మొరాయించడంతో పింఛన్ సొమ్ము పంపిణీకి బ్రేక్ పడింది. దీంతో లబ్ధిదారులు గంటలకొద్దీ నిరీక్షించారు. శుక్రవారం ఉదయమే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం 7.30 గంటల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో గ్రామ సచివాలయ సిబ్బంది గంటల తరబడి లబ్ధిదారుల ఇళ్ల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం 1 గంట వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మొదటి రోజే వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని అధికారులు ఓ వైపు ఒత్తిడి చేయడంతో గ్రామ సచివాలయ సిబ్బంది తిండి, తిప్పలు మానేసి ఫింఛన్ల పంపిణీ కోసం అష్టకష్టాలు పడ్డారు. బనగానపల్లె మండలంలో మొత్తం 12,426 మంది పింఛన్‌దారులు ఉండగా సాయంత్రానికి 93 శాతం మందికి పింఛన్ సొమ్ము అందించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఇక డోన్ పట్టణంలో 5,408 మంది ఉండగా 90 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కొలిమిగుండ్లలో 7047 మంది, కోవెలకుంట్లలో 6,041 మంది లబ్ధిదారులుండగా అనుకున్న మేరకు పింఛన్ల పంపిణీ సాగలేదు. ఇదిలా ఉండగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోవెలకుంట్లమండలం కలుగొట్ల గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

బనగానపల్లె : యాగంటి క్షేత్రంలో శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రుడు శుక్రవారం తెలిపారు. మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 4న మొదటి సోమవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి ఇందిరారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే 11, 18, 25 తేదీల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

6న జాబ్‌మేళా

బనగానపల్లె : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న మేగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లలిత శుక్రవారం తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. డిగ్రీ చదివిన, చదువుతున్న అభ్యర్థులందరూ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. వివరాలకు 8465067538 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

